# శిశువాత్సల్యము

ఆకుండి సత్యనారాయణగారు

మూడేండ్ల బాలికయగు లలిత కిలకిలనవ్వుటయందు, అల్లరిచేయుటయందు మిగుల సమర్థురాలు. చేతనున్న రబ్బరుచేపను మాటిమాటికి ముద్దుకొనుచు వరండాలో నిలువబడిన తల్లిచెంతకు పరుగుపరుగున సరెగి "అమ్మా! చేపలెక్కడుంటాయి?" అని ప్రశ్నించినది. ప్రేమమయియగు తల్లి లలితను దరికి జేర్చుకొని, చిఱునవ్వు జిలుకుచుండెడి యామెపాలబుగ్గల నొక్కసారి ముద్దాడి ప్రేమమధురస్వరముతో "కన్నతల్లీ! చెఱువులోనుండునమ్మా!" అనియెను. "వాటినిపైకితీసిన—" అనియింకను లలిత మాటముగింపకుండనే "చనిపోతవి తల్లీ!" అనుచు నానందమయి (లలితతల్లి) పనిమీాద చటాలున నింటిలోనికి వెడలిపోయినది. తల్లిమాటవిని లలిత గుండె గుభిల్లుమనియెను. ఇంతవఱకు నామె హృదయమున వెలుగుచున్న యానందతేజోలేశ మొక్కసారిగా నంతర్థానమైపోయెను. తనచిన్నిచేప పైనుండిన చనిపోవునుకదాయని యాయమాయిక బాలికకు చాలవిచారము కలిగినది. వెంటనే లలిత తనముద్దుచేపను యింటికెదురుగనున్న చెఱువునకు తీసుకొనిపోయినది. మనసార మఱియొకసారి ముద్దిడుకొనినది. తుదకు విడువలేక 'విడువలేక తనమృదుహస్తములతోడనే చెఱువులో విడచినది. ఒడ్డునకొట్టుచున్న పిల్లకెఱటములచే త్రోయబడి చేప రెండుమూడుసారులు ముందునకు వచ్చినది. అదిచూచి లలిత "చిన్నా! నావద్దకువచ్చెదవా? వలదు, వలదు. వచ్చిన చచ్చిపోయెదవుసుమీ!" అనియెను. కొంతసేపటికి చేప చెఱువుమధ్యకు వెడలిపోయినది. తోడనే లలిత పీడితహృదయముతో నింటకి మరలిపోయినది.

దినములు గడచినవి. అది వేసవికాలము. ఒకనాటి సంధ్యాసమయమున ఆనందమయి చెఱువుమధ్యకుపోయి నీరము ముంచుచున్నది. పార్శ్వమునసే బురదలో రబ్బరుచేపను చూచినది. ఆమె ప్రేమపూర్ణహృదయము చలించిపోయినది. ఆమె నయనములనుండి కన్నీరు పొంగి పొరలిపోవుచుండెను. "తల్లీ!—లలితా!—నీచిన్నిచేప సుఖముగా జీవించవలయునని యిందు విడచితివా?" అనిదుఃఖించుచు నాచేపను మెల్లగా పైకితీసినది. పిదప దానినింటికిగొనిపోయి యద్దపుబీరువాలో నునిచి చూచినపుడెల్ల దుఃఖజనితాశ్రుకణముల జలజలరాల్చుచుండెడిది—పాపము లలిత మాత్రము తన చిన్నిచేపను జూచుట కొక్కసారియైన మఱిరాలేదు.